www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 24 మే 2025
5
చిత్తూరు





ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నారా భువనేశ్వరి (ఫైల్‌ఫోటో)

చంద్రబాబు... ఇక 'పక్కా' లోకల్

గృహప్రవేశానికి కుటుంబ సమేతంగా హాజరు

25న గృహ ప్రవేశం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చంద్రబాబు మొన్నటివరకూ 'లోకల్' ఔనో కాదో గాని, ఆదివారం నుంచి మాత్రం 'పక్కా' లోకల్.. ఎన్నో విమర్శల అనంతరం కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం గ్రామంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన భవనాన్ని నిర్మించారు. గృహప్రవేశానికి 25వ తేదీ సిఎం చంద్రబాబు మూడు రోజుల పర్యటనకు కుటుంబ సమేతంగా రానున్నారు. చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లికి చెందిన సిఎం చంద్రబాబుకు కుప్పం నియోజకవర్గంతో విడదీయలేని అనుబంధం ఏర్పడింది.

1978లో చంద్రగిరి నుంచి చంద్రబాబు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1983లో టీడీపీలో చేరకుండా చంద్రగిరి నుంచే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రబాబు టీడీపీ అభ్యర్థి మేడసారి వెంకట్రామానాయుడు చేతిలో ఓటమి చెందారు. ఆ తరువాత టీడీపీలో చేరారు. అనంతరం తన రాజకీయ మజిలీని కుప్పంకు మార్చుకున్నారు. మొదటిసారి ఆయన 1989లో కుప్పం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పటి నుంచి ఓటమి అంటే తెలియని విధంగా 2024 ఎన్నికల వరకు ఆయన ఎనిమిది ఎన్నికల్లో వరుస విజయాలకు కుప్పం ప్రాంత ఓటర్లు పట్టం కడుతున్నారు. అందుకు ప్రధానంగా అక్కడి ప్రజలతో మమేకం కావడమే అనేది రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. అంతేకాకుండా, కుప్పంలో నేతలు, నాయకులను ఏకతాటిపై నడిపించారు. కార్యకర్తలను సుక్షిత సైనికులుగా మార్చుకోవడంలో సమర్థవంతమైన నాయకులను తయారు చేయడం ద్వారా ప్రతి గ్రామం నుంచి నాయకులతో నేరుగా సంబంధాలు ఏర్పరుచుకున్నారు. ఆ విధంగా నారావారిపల్లెకు మంచి కుప్పం ప్రాంత ప్రజలతో మమేకం అయ్యారు.

సొంత ఇంటి నిర్మాణంతో విమర్శలకు చెక్

కుప్పం నుంచి ఇప్పటికి ఎనిమిదిసార్లు సీఎం చంద్రబాబు విజయం సాధించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్ష నేతగా వచ్చినా ఆయన కుప్పంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బస చేసేవారు. 'కుప్పం ప్రజలు ఇన్నిసార్లు ఆదరించారు. చంద్రబాబుకు కుప్పంలో సొంత ఇల్లు లేదు'' అనేది వైసీపీ సంధించిన ఆరోపణలు. దీనికి సమాధానం చెప్పాలని మూడేళ్ల కిందట సీఎం చంద్రబాబు నిర్ణయించుకున్నారు. కుప్పం-పలమనేరు జాతీయ రహదారిపై శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం వద్ద సీఎం చంద్రబాబు మూడేళ్ల కిందట సొంత ఇంటి నిర్మాణం ప్రారంభించారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా చంద్రబాబు భార్య నారా భువనేశ్వరి, వారి కొడుకు నారా లోకేష్ కుప్పం పర్యటనకు వచ్చిన సందర్భాల్లో నిర్మాణ పనులు పర్యవేక్షించారు. అధికారంలో లేని సమయంలో కూడా కుప్పంలో తిరుపతి గంగమాంబ జాతర, పార్టీ వ్యవహారాలు చూడడానికి వచ్చిన సందర్భాల్లో నారా భువనేశ్వరి తమ ఇంటి నిర్మాణ పనులు పరిశీలించడం, అవసరమైన మార్పులు, సూచనలు చేసేవారని అక్కడి టీడీపీ నేతలు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు సొంత ఇల్లు, పార్టీ కార్యాలయం కూడా అందుబాటులోకి రానుంది.

నేడు కుప్పంకు చంద్రబాబు రాక

ఈనెల 24-26 తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటన నేపథ్యంలో అందుకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్ల పై శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి పరిశీలించారు. ఈనెల 25 న శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీ శివపురం గ్రామం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత ఇంటి గృహప్రవేశం కార్యక్రమం ఉన్నందున ఇందుకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, రూట్ మ్యాప్, సంబంధిత అంశాలపై అడ్వాన్స్ సెక్యూరిటీ లైసెనింగ్ (ఏఎస్ఎల్)లో భాగంగా వి.కోట నుండి శాంతిపురం మండలం ముఖ్యమంత్రి సొంతింటి వద్ద, గుడిపల్లి మండలం ద్రావిడ యూనివర్సిటీ గ్రౌండ్ నందు హెలిపాడ్,కుప్పం పి ఈ ఎస్ మెడికల్ వరకు భద్రతా ఏర్పాట్లును పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. వి.కోట నుండి కుప్పం వరకు రోడ్డు పక్కన చెట్లు పొదలు తొలగించి, పారిశుధ్యం నిర్వహణ,హెలిపాడ్, మెడికల్ కళాశాల ముఖ్యమంత్రి సొంతింటి వద్ద పరిసర ప్రాంతాల వద్ద శానిటేషన్ నిర్వహణ చేపట్టాలని పక్కా గా చేయాలని డిపిఒను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్య మంత్రి సొంతింటి వద్ద వాహనాల పార్కింగ్ ను ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ వారి బందం ఉండాలని, టెంపరరీ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పటిష్ట బ్యారీకేడింగ్ తో పాటు కట్టు దిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ ఏఎస్ఎల్ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ నందకిషోర్, పిఆర్ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, కుప్పం, పలమనేరు ఆర్డిఓలు శ్రీనివాస రాజు, డి పి ఓ సుధాకర్ రావ్, భవానీ, ఏఆర్ డిఎస్ పి.మహబూబ్ బాషా పాల్గొన్నారు.



ఏర్పాట్లలో చిత్తూరు జిల్లా కలెక్టర్

పరుగులు పెట్టని 'కుయ్ కుయ్'లు!

- సమయానికి చేరని108లు
- మరమ్మతులే కారణం
- సిబ్బందికి, రోగులకు తప్పని పాట్లు



ప్రజాశక్తి -విజయపురం (నగరి) : అత్యవసర సేవలు అందించాల్సిన 108 వాహనాలు పరుగులు పెట్టడం లేదు.. మరమ్మతులే కారణం కావడంతో ఇవి సకాలంలో అత్యవసర సేవలు అందించలేక పోతున్నా యని పలువురు విమర్శిస్తున్నారు. పాత వాహనాలు వినియోగిస్తుండడంతో ఎక్కడ పడితే అక్కడ మరమ్మతులకు గురై ఆగిపోతున్నాయి. దీంతో అటు సిబ్బంది, ఇటు రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. పాత వాహనాలకు మరమ్మతులు చేపట్టి అత్యవసర సేవలను మరింత వేగవంతం చేయాలని పలువురు కోరుతున్నారు.నగరి మున్సిపాల్టీ పరిధిలోని మండపం వద్ద నాలుగు రోజుల క్రితం ఒకే చోట 108 వాహనం నిలబడి ఉంది. ఆ వాహనం మరమ్మతుకు గురికావడంతో మండపం వద్ద నిలిచి వుండటం గమనార్హం. అత్యవసరంగా సేవలందించేది 108.. అలాంటి వాహ నాలు ఎలా ఉండాలి.. 'కుయ్.. కుయ్..' అంటూ.. 'రయ్..రయ్'న పరుగులు పెట్టాలి.. అయితే ప్రస్తుత వాహనాలు ఆగితే స్టార్ట్ కావు.. స్టార్ట్ అయితే ఆగవు.. అన్న స్థితిలో వున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను కాపాడే వాహనాలు నేడు భరోసా ఇవ్వలేక పోతున్నాయి. కాలం చెల్లిన వాహనాల కారణంగా అటు సిబ్బంది, ఇటు క్షతగాత్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదంలో గాయ పడిన వారు సమయానికి 108లు రాక ప్రాణాలు కోల్పోతున్నారు. 108 వాహనాలకు రూపకల్పన చేసి రెండు దశాబ్దాలవుతున్నా నిర్వహణ గాలి కొదిలేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

2005 నుంచి ప్రారంభం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి సత్యం కంప్యూటర్స్ భాగ స్వామ్యంతో 2005 ఆగస్టు 15న 108 వాహనాలు రూపొందించి సేవలు ప్రారంభించారు. ఆపద సమయంలో ఉన్న వ్యక్తికి తక్షణ వైద్యం అందించాలన్న సంకల్పంతో ఈ ఉచిత సర్వీసులను తెచ్చారు. తొలుత ఎనిమిది వాహనాలను వైఎస్ఆర్ ప్రారంభించారు. మూడు నెలల వ్యవధిలోనే వీటి సంఖ్య 35కు చేరుకుని విశేష సేవలందిం చడం ప్రారంభించాయి. 2007వ సంవత్సరం వచ్చేసరికి వీటి సంఖ్య 375కు చేరింది. జిల్లాకు పది వాహనాల చొప్పున అందుబాటులోకి తెచ్చారు. ప్రధాన నగరాల్లో జనాభాకు తగినట్టుగా వాహనా లను కేటాయించడంతో 108 సేవలు ఊపందు కున్నాయి. అదే సమయంలో మూడు మండలాలకు ఒక వాహనం చొప్పున కేటాయించి సేవలందించేవారు. 2014లో రాష్ట్ర విభజన జరిగే నాటికి ఉమ్మడి రాష్ట్రంలో 820 వాహనాలు ఉండగా వీటిలో 445 వాహనాలను ఏపీకి కేటాయించారు. అప్పటి నుంచి ఏపీలో బీవీజీ సంస్థ భాగస్వామ్యంతో సేవలందించారు. అయితే 2019లో వీటి సంఖ్య 627కి పెరిగింది. 2019 లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మండలానికి ఒక వాహనం ఉండాలని 104, 108 వాహనాలను వెయ్యి వరకు పెంచారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 814 వాహనాలు అరబిందో ఫౌండేషన్ సంస్థ ద్వారా సేవల్లో ఉండగా వీటిలో 25 శాతం వాహనాలు మూలన పడ్డాయి.

జీతాలందక ఇక్కట్లు..

రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది మార్చి 31 నాటికి 4,436 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. రెండు వాహనా లకు కలిసి ఐదుగురు ఈఎంటీలు, ఐదుగురు పైలెట్లు సేవలందిస్తున్నారు. వీరికి సమయానికి జీతాలందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 108 వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళల పరిస్థితి మరీ అధ్వానంగా వుంది. 108 వాహనాలకు సొంత గూడు కరువే. ప్రస్తుతం మండలానికి ఒక వాహనం చొప్పున వాహనాలు ఉన్నాయి. 108 వాహనాలను ప్రభుత్వమే నిర్వహిం చాలని ప్రై వేటు భాగస్వామ్యం లేకుండా చేయాలని సిబ్బంది అనేక ఏళ్లుగా పోరాడుతున్నారు. కానీ నేటికీ అది సఫలీకృతం కావడంలేదు.

వాహనాల నిర్వహణ గాలికి..

108 వాహనాల్లో మూడు రకాల వాహనాలు ఉండగా వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎల్ఎస్ వాహనాలు సేవలందిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో బీఎల్ఎస్ వాహనాలు, నగరాల్లో ఏఎల్ఎస్ వాహనాలు సేవలందిస్తున్నాయి. గత ఐదేళ్లగా రోడ్లు అధ్వానస్థితికి చేరుకోవడంతో వాహనాల పరిస్థితి మరీ దుర్భరంగా మారింది. 108 వాహనానికి మరమ్మతు వస్తే కనీసం నెల రోజుల సమయం పడుతుండడం, షెడ్డు నుంచి వచ్చిన కొద్ది రోజుల వ్యవధిలోనే మళ్లీ మరమ్మతులకు గురవు తుండడంతో సరైన సమయానికి వాహనాలు అందుబాటులో లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరు కోవడం కష్టమైపోతోంది. దీంతో చాలా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇటీవల 108 వాహనాలు తోస్తేగాని స్టార్ట్‌కాని పరిస్థితులు ఉన్నాయంటే కండీషన్ అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి వాహనాలతో అత్యవసర సమయంలో ప్రాణాలకు రక్షణ ఎలా?' అనే దానిపై అయోమయం నెలకొంది. అత్యవసరంగా వెళు తున్న వాహనం దారి మధ్యలో నిలిచిపోతే పరిస్థితి ఏంటనే దానిపై ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం 108లపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

మండల కేంద్రానికి వేరుశనగ విత్తనాలు



మండల కేంద్రానికి చేరిన వేరుశనగ విత్తనాలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనా లు మండలానికి శుక్రవారం చేరు కున్నాయి. ఈ సందర్భం గా ఏవో గీత మాట్లాడుతూ మండల పరిధిలోని సచివాలయాల్లో ప్రభు త్వం అందించిన వేరుశనగ విత్తనా లు పంపిణీకి సిద్ధంగా ఉన్నా యన్నారు. ఒక కేజీ వేరుశనగ కాయలు 93 రూపాయలు ఉండగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా విత్తనాలు త్వరలోనే అందిస్తున్నారని మండల ఏవో గీతా కుమారి తెలిపారు.



ఉర్దూ డిఎస్‌సి మెటీరియల్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే

ఉర్దూ డిఎస్‌సి మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - యాదమరి:

ఉర్దూ డిఎస్‌సి మెటీరి యల్ చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మైనారిటీ విద్యార్థులకు పంపిణీ చేశారు. శుక్రవారం చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయంలో చిత్తూరు నియోజక వర్గం పరిసర ప్రాంతాలలో ఉన్న మైనారిటీ విద్యార్థు లకు డీఎస్సీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఖాజి సయ్యద్ కమాలుల్లా జుహూరి మాట్లాడుతూ ముస్లింలకు ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. అంజుమన్ తరకీ ఉర్దూ కమిటీ వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ సభ్యులు అబ్దుల్ ఘని, అబ్దుల్ గఫార్, పీసీఆర్ ప్రిన్సిపాల్, పార్టీ నాయకులు జాఫర్ షరీఫ్, అక్మల్ ఖాన్,కార్పొరేటర్ సయ్యద్,అక్తర్,సుల్తాన్, రసూల్, రూటా మునీర్, షేరు, కుయ్యా పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంట్ మూసివేత

- అందని నీటి సరఫరా
- రూ.15 వెచ్చించి క్యాన్ కొనుగోలు
- సమస్య పరిష్కరించాలని ప్రజల వినతి

ప్రజాశక్తి -సోమల: గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌కు నీటి సరఫరా లేక మూతపడింది. ఈ కారణంగా ప్రజలు 15, 20 రూపాయలు వెచ్చించి బయట తాగునీటి క్యానును ప్రైవేటు వ్యక్తుల నుండి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రస్తుత పాలకులు వెంటనే స్పందించి ఆర్‌వో ప్లాంటుకు తాగునీ[ru]దించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మండలంలోని నెల్లివెంద పంచాయతీ ఎగువపల్లి గ్రామంలో 125 కుటుంబాల కోసం 2024 ఫిబ్రవరిలో నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించిన ఆరో ప్లాంట్‌కు నీటి సరఫరా చేయకపోవడంతో ప్రజ లకు శుద్ధ జలం కరువైంది. ప్రైవేటు వ్యక్తుల నుండి ఒక్కో క్యాన్ 15 నుండి 20 రూపాయలు ధర వెచ్చించి శుద్ధ జలాన్ని కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. ఐదు లక్షల రూపాయల వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆర్వో ప్లాంట్ 2024 ఫిబ్రవరి 28వ తేదీ అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఆ తర్వాత ఆర్వో ప్లాంట్ కు బోరు బావి నుండి నీటి సరఫరా చేయకపోవడంతో ప్రస్తుతం మూసిన తలుపులు తెరుచుకోలేదు. ఆర్‌ఓ ప్లాంట్ లో యంత్రాలు విద్యుత్ కనెక్షన్ అన్ని సిద్ధంగా ఉన్నా తాగునీటి సరఫరా లేకపోవడంతో వృథాగా మారింది. కొంగల ఒడ్డు తాగునీటి బోరు నుండి పైపులు వేసి ఆరో ప్లాంట్‌కు నీటి సరఫరా చేసి ప్లాంట్ ప్రారంభమై శుద్ధ జలం ప్రజలకు అందే విధంగా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆరో ప్లాంట్ ప్రారంభమైతే గొల్లపల్లి, చింతల వారి పల్లి, ఎగువపల్లి గ్రామ స్తులు శుద్ధ జలం తాగే అవకాశం ఉందని, గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్ర చిన్నారులు కూడా స్వచ్ఛమైన నీరు తాగే అవకాశం వుంది. వెంటనే ఆర్వో ప్లాంట్ కు తాగునీటిని సరఫరా చేసేందుకు పైపులు వేసి గ్రామస్తులు స్వచ్ఛమైన నీటిని అందించాలని ప్రజల కోరుతున్నారు.



మూసివేతకు గురైన ఆర్‌వో ప్లాంట్

వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:

భర్త ,అత్త వేధింపులు భరించలేక వివాహిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని తంబు గాని పల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు గ్రామానికి చెందిన కిరణ్ భార్య నందిని (21) శుక్రవారం ఉదయం గ్రామంలోని వారి స్వగృహంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసు కుంది. వివాహమై మూడు సంవత్సరాల అవుతున్నా పిల్లల కలగకపోవడంతో భర్త, అత్త వేధించడం వల్ల శుక్రవారం మనస్థాపానికి గురై ఇంట్లోనే ఉన్న బీరువాకు కొంగుతో బిగించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెని బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



ఆత్మహత్యకు పాల్పడ్డ నందిని

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

ప్రజాశక్తి-చౌడేపల్లి: 'ప్రేమించి పెళ్లి చేసుకున్నాం.. పెద్దల నుంచి రక్షణ కల్పించండి ..'అంటూ పోలీసులను ఓ ప్రేమ జంట ఆశ్రయించింది. వారి కథనం మేరకు... చౌడేపల్లి మండలంలోని ఆమినిగుంట గ్రామానికి చెందిన రమేష్ కుమారుడు ప్రేమ్ కుమార్ పెద్దపంజాణి మండలం రాయల పేట తాయారమ్మ కాలనీ రెడ్డి నాగరాజా కుమార్తె లక్ష్మీ ప్రియ చదువుతూ ఆరు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. కులాంతర వివాహాన్ని పెద్దలు నిరాకరించడంతో తమకు రక్షణ కల్పించాలని వారిద్దరూ పెళ్లి చేసుకుని స్థానిక పోలీసులను ఆశ్రయించారు.



కిశోరి బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపరు వైజర్ బిందుమాలతి

బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: సమాజంలో బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా ఉన్నత విద్యలపై దృష్టి సారించాలని మండల అంగన్‌వాడీ సూపరువైజర్ బిందు మాలతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గంగాధర నెల్లూరు గ్రామ సచివాలయంలో కిశోరి వికాసం కార్యక్రమం ద్వారా ఆడపిల్లలకు ఉన్నత విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో 11 నుండి 18 సంవత్సరాల వయసు కలిగిన ఆడపిల్లలకు ఉన్నత విద్యులపై అవగాహన కల్పించాలని, బాల్యవివాహాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ నిర్మల, అంగన్‌వాడీ వర్కర్లు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

సంఘీభావ ర్యాలీ



ప్రజాశక్తి- కుప్పం రూరల్ : ఆపరేషన్ సింధూర్ భారతీయులకు గర్వ కారణమని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావంగా కుప్పం పట్టణంలో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో భాగంగా జాతీయ పతాకాన్ని చేతపట్టి కూటమి నాయకులు పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి, ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్, టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: భారత పర్యాటక శాఖ ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించనున్న 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్ (ఎస్ఐహెచ్ఎంసిటి అండ్ ఎఎన్, తిరుపతి)లో 2025-26 సంవత్సరానికి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా పర్యాటక శాఖ అధికారి గౌరీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఎస్‌సి (హెచ్ అండ్‌హెచ్ఎ) (బిఎస్‌సి, హెచ్‌అండ్ హెచ్ఎ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్ 40 శాతం మార్కుల పైగా సాధించిన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఈ కోర్సులో ఎఫ్‌అండ్‌బి ప్రొడక్షన్, ఎఫ్‌అండ్ బి సర్వీస్, కరెంట్ ఆఫీస్ అండ్ హౌస్ కీపింగ్ నేర్పించి 4 నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ కోర్సుకు, యస్‌యస్‌సి పాసైన వారి నుండి దరఖాస్తులు కోరుతున్నామని, ఈ కోర్సులో ఒక సంవత్సరము పాటు దేశ విదేశాల వంటకములు నేర్పించి 6 నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్టిఫికేట్ కోర్స్ ఇన్ ఫుడ్‌అండ్‌బేవరేజ్ సర్వీస్ కోర్సునకు, యస్‌యస్‌సి పాసైన వారి నుండి దరఖాస్తులు కోరుతున్నామని ఈ కోర్సులో ఐదు నెలల పాటు రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి 1 నెల ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వనున్నటుల తెలిపారు. ఈ కోర్సులు పూర్తి అయిన తరువాత ప్రముఖ ఫైవ్ స్టార్ హోటళ్ళలో ఉద్యోగ అవకాశాలు, బ్యాంక్ లోన్ సదుపాయం, బాల బాలికలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం వుంటుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులు, ఇతర ఏదైనా సమాచారం కోసం 9701343846, 9700440604, 9502113 163 ద్వారా గాని, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఎస్ఐహెచ్ఎంటిపిటి.ఒఆర్‌జి ద్వారా కాని సంప్రదించాలన్నారు. ఈ కోర్సులకు 2025-26 విద్యా సంవత్సరానికి అప్లై చేసుకుని ఈ సదావకాశాన్ని వినియోగించుకుని తద్వారా ఉపాధి పొందాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి, కె శివరామకృష్ణ అడ్మిషన్స్ (ఇన్‌ఛార్జి) ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపీడీవో జాడేదీ ?!

- క్యాంపుల పేరుతో ఆఫీసుకు రాని వైనం
- వారంలో మూడు రోజులు మాత్రమే రాక
- కార్యదర్శిలూ పరిచయం చేసుకోవాల్సిన పరిస్థితి
- ముందుకు సాగని మండల అభివృద్ధి

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జాడ కనిపించడంలేదు.. క్యాంపుల పేరుతో వారానికి మూడు రోజులు మాత్రమే హాజరవుతున్నారని కార్యాలయానికి వచ్చే వారు పేర్కొంటున్నారు. ఇటు పంచాయతీ కార్యదర్శిలు, సిబ్బంది నిరీక్షించి చివరికి వెనుతిరగాల్సి వస్తోందని అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని వాపోతున్నారు. ఎంపిడివో వచ్చినా తాము ఎవరో పరిచయం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని కార్యదర్శిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పై స్థాయి అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టి మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఎంపీడీవో జాడేది?

నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు స్థానికంగా నివసించాల్సి వుంది. అయితే ఇక్కడి ఎంపీడీవో ప్రతి రోజూ మదనపల్లి నుండి కార్యాలయానికి వస్తారని, రోజూ కార్యాలయానికి మధ్యాహ్నం12 గంటలకు హాజరవుతారని స్థానికులు పేర్కొంటున్నారు. సెల్ ఫోన్‌తో కాలక్షేపం చేసి భోజన సమయం అనంతరం తిరిగి మదనపల్లికి వెళ్లిపోతున్నారని వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే వారు వాపోతున్నారు. వారానికి మూడు రోజులు మాత్రమే కార్యాలయానికి వచ్చి వెళుతున్నారని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు వచ్చినా ఖాళీ కుర్చీ కనిపిస్తోందని దీంతో నిరాశతో వెనుతిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యదర్శిలూ పరిచయం చేసుకోవాల్సిన పరిస్థితి

కార్యాలయంలో ఎంపిడివో లేకపోవడంతో అటు పంచాయతీ కార్యదర్శులకు, ఆఫీసుకు అనేక రకాల పనుల కోసం వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అంటున్నారు. ముఖ్యంగా ఎంపీడీవోది ఉపాధి హామీలో కీలక పాత్ర.. ప్రతి రోజూ కనీసం ఐదు పనులైనా తనిఖీ చేసి నివేదికలు పంపాల్సి వుంటుంది. అయితే ఎంపిడివో తన సెల్ ఫోను ఉపాధి హామీ సిబ్బందికిచ్చి తనిఖీ చేసినట్లు గా పనులను, కూలీలను ఫొటోలు తీసి ఆయనకు చేరవేయడం మామూలు అయిపోయిందని పలువురు పేర్కొంటున్నారు. తాము ఎలాంటి పంచాయతీ అభివృద్ధి పనులు చేయాలన్నా పర్సంటేజ్ తప్పనిసరి అని డిమాండు చేస్తున్నారని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఎంపిడివో వచ్చి సంవత్సరం గడుస్తున్నా పంచాయతీ కార్యదర్శులు వారి దగ్గరకు వెళితే 'ఎవరు నువ్వు ..ఏమి కావాలి?' అని అడగడం విడ్డూరంగా ఉందని, వెళ్లినప్పుడల్లా 'నేను పలానా పంచాయతీ కార్యదర్శి" అని పరిచయం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు అంటున్నారు.

కార్యాలయంలో స్టేషనరీ కరువు



మధ్యాహ్నం 12 అవుతున్నా ఖాళీగా కనిపిస్తున్న ఎంపీడీవో సీటు

కార్యాలయంలో స్టేషనరీ సామగ్రి సైతం కరువైందని, అడిగితే కసురుకుంటున్నారని సిబ్బంది పేర్కొంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వాచ్‌మ్యాన్‌కు సైతం పది నెలలుగా జీతం మంజూరు చేయలేదని అడిగితే కోపం వ్యక్తం చేస్తున్నారని 'ఇష్టం లేకపోతే నిలిచిపో..!' అంటున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆయన ప్రవర్తనకు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. పై స్థాయి అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ఎంపిడివో కార్యాలయ పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో మహేష్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బంగారు పాలెం మండల ఎంపీడీవోగా మహేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బైరెడ్డిపల్లి మండల కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోగా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. నూతన ఎంపీడీవోకి ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్ స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఉన్న శ్రీధర్ ఏవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది విజయ్ కుమార్, అనిల్, కళావతి, రేణుక పాల్గొన్నారు.

జాతరలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక పరిధిలో 190 రామాపురం గ్రామంలోని అంకమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన జాతరలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు. జాతర కోసం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంకమ్మకు ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేని పూలమాల, శాలువాతో సత్కరించారు.


బోరుబావికి మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం అన్నెమ్మ గారి పల్లి పంచాయతీ వడ్డి రామాపురం గ్రామంలో ప్రజలకు తాగు నీటిని అందించే బోరు మోటారు ఇటీవల మరమ్మ తుకు గురైంది. వెంటనే స్పందిం చిన పంచాయతీ కార్యదర్శి లలిత కుమారి శుక్రవారం బోరు మోటారుకు మరమ్మతు లు చేయించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తెలియగానే స్పందించి బోరు మోటార్‌కు మరమ్మతు చేయించి ప్రజలకు తాగునీరు అందించారన్నారు.

గుండె పోటుతో సర్పంచ్ మృతి


మృతి చెందిన సర్పంచ్ రత్నయ్య (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గుండె పోటుతో సర్పంచ్ రత్నయ్య శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని టేకు మంద గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు గురువారం రాత్రి గుండెల్లో నొప్పిగా ఉందని అతనిని ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందాడని తెలిపారు. శుక్రవారం ఆయన రత్నయ్య మృతి దేహాన్ని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, వైసిపి శిరీష్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ఓదార్చారు . ఈయన టేకు మంద పంచాయతీకి రెండవసారి సర్పంచిగా పదవి చేపట్టారు.



ఫీల్డ్ సర్వే చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రైతు సేవ కేంద్రంలో పనిచేసే సిబ్బంది సకాలంలో ఫీల్డ్ సర్వే పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ కోరారు. శుక్రవారం మండలంలోని మోతరంగన పలిలో మామిడి పంట సాగు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి మామిడి రైతులను పంట దిగుబడి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జ్యోతి రెడ్డి, రైతు సేవ కేంద్రం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ స్వాతి, సిబ్బంది, పలువురు రైతులు, పాల్గొన్నారు.

పర్మినెంటు ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలి

తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి ప్రజల అభ్యర్థన



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: తీర్థం ప్రాథమిక కేంద్రంలో పర్మినెంటు ల్యాబ్ టెక్నీషియన్ ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. మండలం పరిధిలోని తీర్థం ప్రాథమిక కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న హరి ప్రసాద్ వారానికి మూడు రోజులు మాత్రమే పనిచేస్తున్నారు. మిగతా రోజుల్లో జిల్లా మలేరియా ఆఫీసులో విధులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండలంలో మారుమూల ప్రాంతంగా వుంది. వివిధ రోగాలతో బాధపడి ఆరోగ్య కేంద్రానికి చేరుకుంటున్న వారు రక్త పరీక్షలు చేసుకునేందుకు ఇబ్బందికరంగా మారింది. దీనివల్ల ప్రజలపై భారం పడుతోంది. బస్సులు, ప్రమాణ సౌకర్యం లేక రోగులు ఇబ్బందులు పడుతూ సుమారు పది కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రమైన బైరెడ్డిపల్లికి చేరుకొని ప్రైవేట్‌లో ల్యాబ్‌కు సంబంధించిన వివిధ పరీక్షలు చేయించుకొని తిరిగి డాక్టర్ వద్దకు చేరుకోవాల్సి వుంది. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై డిఎంహెచ్‌వోకు ప్రజలు తెలిపారు. స్పందన లేక పోయింది. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వహిస్తున్న హరి ప్రసాద్‌కు మూడు రోజులు ఇక్కడ పనిచేస్తున్నాడని, తర్వాత రోజుల్లో జిల్లా స్థాయిలో మలేరియా ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందిగా కాలం గడుపుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. జిల్లాస్థాయిలో విధులు నిర్వహించాలంటే బైరెడ్డిపల్లి మండలంలో పనిచేస్తున్న వారే అవసరమా? అక్కడ దగ్గర ఉన్న హాస్పిటల్ నుండి పిలుచుకోవచ్చు కదా?' అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పర్మినెంటు ల్యాబ్ టెక్నీషియన్ లేక తీర్థం ప్రాథమిక కేంద్రానికి వస్తున్న రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది దీనిపై డాక్టర్ అరుణ్ కుమార్‌ని విచారణ కోరగా జిల్లా స్థాయి అధికారులు అలా చేస్తున్నారని ఈ విషయమై ఫిర్యాదు కూడా పంపామని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి రోగులు ఇబ్బందులు పడకుండా పర్మినెంట్ ల్యాబ్ టెక్నీషియన్‌ను తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఉండేలా చర్యలు చేపట్టాలని చుట్టుపక్కల గ్రామస్తులు, వివిధ రోగులతో కోరుతున్నారు.


సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : సీఎం సహాయనిధి ద్వారా బాధితులకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న పది మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.13,21,244 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే తన కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ.. ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సాయం అందించడం వల్ల ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. చిత్తూరు నగరానికి చెందిన పి.విజయ (రూ.2,67680), పి.షమీమ్ తాజ్ (రూ.30,000), జి.గౌతమ్ కుమార్ (రూ.50,916), పీఆర్ దుర్గ (రూ.42,205), చిత్తూరు రూరల్ మండలానికి చెందిన వి.సంతానమ్మ (రూ.1,73,382), కె.శంకర్ నాయుడు (రూ.1,05,043) మంజూరు చేశారు. ఆర్ నాగరాజు (రూ.1,18,881), ఎ.కృష్ణమూర్తి (రూ.1,49,371), గుడిపాల మండలానికి చెందిన సి.వాసు మూర్తి (రూ.1,80,280), ఎం.సోమశేఖర్ (రూ.2,03,486) చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మోహన్ రాజ్, రఘు, మేషక్, వార్డు ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.



యోగా యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టరు కంచెర్ల శ్రీకాంత్

యోగా యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ యోగా యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి లోనవుతున్నారని, ఇందువల్ల మానవాళి త్వరితగతిన అనారోగ్య పాలవుతున్నట్టు తెలిపారు. ఒత్తిడిని నివారించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యల నుండి బయటపడవచ్చని, ఇందుకు ఏకైక మార్గం యోగా మాత్రమే అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు యోగ ఆంధ్ర – ఆరోగ్య ఆంధ్ర' కార్యక్రమాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలో యోగా యాత్రను ప్రారంభించా మన్నారు. ఈ యాత్ర జూన్ 21వ తేదీ వరకు కొనసాగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి పాలక మండలి సభ్యులు శాంతారామ్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, కౌన్సిలర్ జిమ్ దాము, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు, యోగా శిక్షకులు గణేష్ పాల్గొన్నారు.

సమస్యలు సకాలంలో పరిష్కరించాలి: ఎమ్మెల్యే


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు ఎమ్మెల్యే కార్యా లయంలో శుక్రవారం 'ప్రజా దర్బార్' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారు లతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. శుక్రవారం మొత్తం 64 వినతులు, ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ప్రజల నుంచి అంది న వినతులు, ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయి లో విచారణ చేసి, పరిష్క రించి నివేదికలను సమర్పిం చాలని మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టరు లోకేష్, గుడిపాల, చిత్తూరు రూరల్ తహశీల్దార్లు జయంతి, లోకేశ్వరి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన మినీ మహానాడు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయ ఆవరణలో స్థానిక టిడిపి నాయకులు శుక్రవారం నిర్వహించిన మినీ మహానాడు ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మణిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుండి కడప జిల్లాలో టిడిపి నిర్వహించనున్న మహానాడును జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. మహానాడు జయప్రదంలో భాగంగా టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పిలుపుమేరకు మినీ మహానాడు నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి, వారి అభిప్రాయాలకు అనుగుణంగా తొమ్మిది ప్రతిపాదనలు చేశారు. కుప్పం ప్రాంత అభివృద్ధిపై సుదీర్ఘ చర్చ జరిపి, కార్యకర్తల అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, కుప్పం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్, మాజీ శాసనమండలి సభ్యులు గౌనివారి శ్రీనివాసులు, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగుల హర్షం



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది ఉద్యోగ భద్రత విషయమై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సర్క్యులర్ – 1/2019 ను విడుదల చేయడం హర్షణీయమని ఏపీఎస్ఆర్టీసీ చిత్తూరు – 2 వ డిపో ఎన్ఎంయుఏ అధ్యక్షులు జే హరిబాబు తెలిపారు. ఉద్యోగ భద్రతపై సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎన్ఎంయుఏ ఆధ్వర్యంలో చిత్తూరు ఆర్టీసీ రెండవ డిపో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ చిత్తూరు 1 వ డిపో ఎన్ఎంయుఏ అధ్యక్ష, కార్యదర్శులు జే హరిబాబు, జిఎస్ కుమార్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తమ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫలితంగానే నేడు ఉద్యోగ భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ విడుదల చేశారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని దాదాపు 48 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయుఏ సుదీర్ఘ పోరాటం చేసిందని తెలిపారు. ప్రధానంగా 19 డిమాండ్లపై వివిధ రకాలుగా ఆందోళనలు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందిస్తే అందులో ఉద్యోగ భద్రత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు.

గురువారం రికార్డు స్థాయిలో భక్తుల దర్శనం

ప్రజాశక్తి - తిరుమల

వేసవి రద్దీ నేపథ్యంలో తిరుమలలో వారం రోజులుగా భక్తుల తాకిడి పెరిగింది. సాధారణంగా గురువారం ఉదయం తిరుప్పావడ సేవ, సాయంత్రం పూలంగి సేవ ఉన్న కారణంగా భక్తులకు దర్శన సాధారణంగా రెండు మూడు గంటలు పైగా తగ్గుతుంది. సాధారణంగా కేవలం 62 నుండి 63 వేల మంది భక్తులు మాత్రమే శ్రీవారిని దర్శించుకుంటారు. అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి నేతత్వంలో, తిరుమలలోని అన్ని విభాగాలను ఎప్పటికప్పుడు సమన్వయపరుస్తూ, దాదాపు పదివేల మందికి పైగా భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కారణంగా తొలిసారి గురువారం 72,579 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. విశేష కషి చేసిన అన్ని విభాగాల సిబ్బందిని అదనపు ఈవో అభినందించారు.

అదనపు ఈవో ఆకస్మిక తనిఖీలు

తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి శుక్రవారం వేకువజామున దర్శన క్యూలైన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కష్ణతేజ విశ్రాంతి భవనం వద్ద క్యూలైన్లలో శ్రీవారి సేవకులు పంపిణీ చేస్తున్న అన్న ప్రసాదాలు, పాలు, తాగునీటిపై ఆరా తీసి టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలపై భక్తుల నుండి అభిప్రాయాలు తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

వైభవంగా గరుడ వాహనం



ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవరోజు శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై విహరిస్తూ స్వామి భక్తులను కనువిందు చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, భక్త బృందాల నృత్య ప్రదర్శనల నడుమ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఉదయం మోహినీ అవతారంలో పల్లకిలో దర్శనమిచ్చారు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి, నిత్యకైంకర్యాలను నిర్వహిం చారు. ఉదయం 7.30 నుంచి 9.30 వరకు మోహినీ అవతారంలో పల్లకిలో నగర వీధుల్లో విహరించారు. 10 నుంచి 11 గంటల వరకు రుక్మిణీ సత్యభామా సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవ మూర్తులకు వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. దూప దీప నైవేద్యాలు సమర్పించారు. రాత్రి టీటీడీ అధికారులు గరుడవాహన సేవకు పట్టు వస్త్రాలను సమర్పించారు. రాత్రి 7 గంటలకు విశేషాలంకృతుడైన వేణుగోపాలుడు గరుడ వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో 10 గంటల వరకు విహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయ అధికారి సురేష్ కుమార్. శరాబ్ బాబు సురేష్, కంకణ బట్టర్ తరుణ్ కుమార్, వేదపడితులు నారాయణదాసరి, గోపాలాచారి, శబరీష్, ధన్వంతరి, ప్రశాంత్, టీటీడీ ఆలయ సిబ్బంది పలువురు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మహాభారత ఉత్సవాలు



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి గ్రామంలో మహాభారత ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలు గరుడ స్తంభానికి పూజలు సకల దేవతలను ఆహ్వానించి హోమం కార్యక్రమాలు చేసి ప్రారంభించారు. అంతకు ముందుగా ద్రౌపది సమేత ధర్మరాజుకు ఆలయ అర్చకులు సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి వివిధ పుష్పాలతో సుందరం అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వీరికి ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ప్రసాద్ రెడ్డి వెంకట్ రెడ్డి,శ్రీధర్ యాదవ్, జయరాం రెడ్డి, యుగంధర్, దేవరాజు నాయుడు, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

హాకింగ్స్ పాఠశాలపై ఆందోళన వద్దు

పాఠశాల కమిటీ ఛైర్మన్ హఫీజ్



ప్రజాశక్తి- కుప్పంరూరల్ : కుప్పం పట్టణంలోని హాకింగ్స్ పాఠశాల నిరభ్యంతరంగా కొనసాగుతుందని, ఎవ్వరూ ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని పాఠశాల కమిటీ అధ్యక్షులు హఫీజ్ పత్రికాముఖంగా తెలిపారు. శుక్రవారం ఆయన పాఠశాలలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో తాము హాకింగ్స్ ఇంటర్నేషనల్ పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఆనాటి నుండి నేటి వరకు నిరంతరాయంగా కొనసాగుతున్న తమ పాఠశాలలో 950 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్టు తెలిపారు. తమ విద్యాసంస్థ 120 మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. గత రెండు సంవత్సరాలుగా పాఠశాలలో విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు అవసరమైన అనుమతులన్నీ పాఠశాల పొందిందని, అయితే తమ పాఠశాల అనుమతులను రద్దు అయినట్టు వచ్చిన వార్తలలో వాస్తవం లేదన్నారు. సీబీఎస్ఇ అనుమతులు పొందిన తమ పాఠశాలకు సంబంధించి కేవలం రాష్ట్ర ప్రభుత్వ అనుమతులను మాత్రమే రద్దు చేసినట్టు తెలిపారు. అయితే సిబిఎస్ఇ అనుమతులతో తమ పాఠశాల నిరభ్యంతరంగా కొనసాగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్తీక్, పల్లవి

చెరువులో మునిగి బాలిక మృతి

ఇద్దరిని రక్షించిన స్థానికులు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగిను ముగ్గురు బాలికల్లో ఓ బాలిక మృతి చెందింది. ఇద్దరిని స్థానికులు రక్షించారు. ఈ సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా పొన్నై గ్రామానికి చెందిన లావణ్య (12) వేసవి సెలవుల సందర్భంగా ఎస్ఆర్ పురం మండలంలోని తయ్యూరు గ్రామ పంచాయతీ 50 బసివి రెడ్డి పల్లి లోని మేనత్త లత ఇంటికి వచ్చింది. శుక్రవారం మేనత్త లతా తన అన్న కూతురైన లావణ్యతో పాటు కూతురు పల్లవి, కొడుకు కార్తీక్, ముగ్గురు పిల్లలతో కలిసి గ్రామ సమీపంలోని మొక్కల చెరువుకు వెళ్లి చేపలు పడుతుండగా పిల్లలు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చెరువులో లోతైన ప్రాంతానికి వెళ్లి మునిగిపోయారు. వారు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు కార్తీక్ , పల్లవిలను బయటకు లాగారు. లావణ్య అప్పటికే మృతి చెందింది. కార్తీక్, పల్లవిలను హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి: కమిషనర్



ప్రజాశక్తి-పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మైనారిటీ కార్పొరేషన్ లోన్లకు ఈనెల 25వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్వి రమణారెడ్డి తెలిపారు. గతంలో బీసీ కార్పొరేషన్ లోన్లు అప్లై చేసుకుని అర్హత పొందని మైనారిటీలు స్థానిక మెప్మా ఆఫీస్‌లో గతంలో అప్లై చేసుకున్న అప్లికేషన్ డెలిషన్ చేసుకొని కొత్త లోన్‌కు అప్లై చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి కోరారు.

వారపు సంత రద్దు

ప్రజాశక్తి -శాంతిపురం : ఈనెల 25న ఆదివారం నిర్వహించ నున్న వారపు సంతను రద్దు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అశ్వత్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయనే ఉద్దేశంతో సంతను 28వ తేదీ బుధవారానికి వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని వ్యాపారస్తులు ప్రజలు దుకాణదారులు సహకరించాలని ఆయన కోరారు.



ఘనంగా మాతమ్మ విగ్రహ ప్రతిష్ట

పెద్దపంజాణి-పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు గ్రామపంచాయతీ, బసవరాజుకండ్రిగ గ్రామంలో నూతనంగా మాతమ్మ విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేకం శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం గోధూళి లగ్నమందు గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనము,బింబశుద్ధి, బింబ అష్ట బంధం, కళశ స్థాపన, బింబ జలాదివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం, మంగళహారతి తీర్థప్రసాద వినియోగించారు. శుక్రవారం ఉదయం నిత్య కళశారాధన, ప్రాణ ప్రతిష్ఠ సర్వకళా హోమం, అమ్మవారి ప్రధాన హోమం, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, అలంకరణ గోపూజ, గోదర్శనం, బళి, మంగళహారతి తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం మాతమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం చేసి తర్వాత బాట గంగమ్మ ఆలయ ప్రారంభోత్సవం చేశారు.ఈ కార్యక్రమంలో బసవరాజు కండ్రిగ గ్రామస్థులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నాకు ఐద్వా మద్దతు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ గత 25 రోజులుగా ఆయా డిఎంహెచ్ఓ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్నారు. శుక్రవారం వారి ధర్నాకు ఐద్వా జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి మాట్లాడుతూ పనిభారం ఉన్నా ఎప్పటికైనా తమను రెగ్యులరైజ్ చేస్తారని, తమ వేతనాలు పెంచుతారని,ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారన్న ఆశతో వారు పనిచేస్తున్నారన్నారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లోఉపకరణాల కొరత ఉందన్నారు. 'సామాజిక ఆరోగ్యాన్ని కాపాడుతూ, సేవలందిస్తున్న వారికి గౌరవం ఇవ్వాలి' అనే నినాదంతో ధర్నా కొనసాగుతోంది. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు హెచ్చరించారు.

తిరుమలలో మద్యం మత్తులో పోలీసుల హల్‌చల్

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో మద్యం మత్తులో పోలీసులు హల్‌చల్ చేశారు. .కర్నూలుకు చెందిన ముగ్గురు కానిస్టేబుళ్లు మద్యం మత్తులో తిరుమలకు వచ్చారు. ఘాట్ రోడ్డులో ర్యాష్ డ్రైవింగ్‌తో పలు వాహనాలను ఢీకొట్టారు. రోడ్డుపై నానా హంగామా చేశారు. ఫుల్‌గా మద్యం తాగి భక్తులను ఇబ్బందులకు గురిచేశారు. తిరుమల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీస్ స్టేషన్‌కు వారిని తరలించారు. కర్నూలుకు చెందిన కానిస్టేబుళ్లు రాజశేఖర్, ఓంకార్ నాయక్, షేక్ సరాఉద్దీన్‌గా గుర్తించారు. డ్రంక్ డ్రైవ్ టెస్ట్‌లో 300 పాయింట్లు చూపించినట్లు సమాచారం. ఓ కానిస్టేబుల్ ఘటన స్థలం నుంచి పరారీ కాగా, పోలీసులు విచారణ చేపట్టారు.